# 43

# దురాశకు పోతే...

మత్స్యపురి... సముద్రపు ఒడ్డున వున్న చక్కని ఊరు.

అక్కడ ప్రకృతి ఎంతో అందంగా వుంటుంది. ఆ సముద్ర తీరానికి దగ్గరలోనే ఏనాటిదో ఒక శివాలయం వుంది. అది కనీసం ఆరేడు వందల సంవత్సరాల పూర్వం నాటిది. ఆ కాలంలో అది ఘనంగా ఒక వెలుగు వెలిగేది. ఆ చాయలు ఇప్పటికీ కనిపిస్తూనే వుంటాయి. ఆ రాజ్యాలు పోయాయి, ఆ రాజులూ పోయారు. దాంతో దాని వైభవం అంతకంతకీ అంతరించింది. చివరికి ఈనాటి శిథిలావస్థకి వచ్చింది.

సాధారణంగా శివాలయాలు ఆలనా పాలనా లేకుండా బిక్కుబిక్కుమంటూ వుంటాయి. అందుకే పేదవారి ఇళ్ళను 'శివాలయం' అంటూండడం పరిపాటి అయింది. చివరికి ఈ శివాలయం కూడా ఆ స్థాయికి జేరుకుని ఆ పేరును సార్థకం చేసుకుంది.

ఆ ఊరిలో 'శంకరశాస్త్రిగారు' అనే ఆయన వుండేవారు. ఆయన మంచి పండితుడు. ఆయనకి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. ఎప్పుడూ దైవధ్యానం చేసుకుంటూ కోరిన వారికి చేతనైన సహాయం చేస్తూండేవాడు.

శిథిలావస్థలో వున్న శివాలయం విషయంలో ఆయనకి ఎంతో దిగులుగా వుండేది. ఆ ఆలయాన్ని బాగు చేయించి తన శేష జీవితాన్ని ఆ స్వామి సన్నిధిలోనే గడపాలనేది ఆయన నిర్ణయం!

తన సంకల్పాన్ని ఊరి పెద్దలు పదిమందికీ చెప్పి ఆలయ పునరుద్ధరణ కోసం చందాలు వసూలు చేయడం మొదలుపెట్టారు.

'శాస్త్రిగారు నిస్వార్థపరుడు' – అన్న విషయం అందరికీ తెలిసిందే. అందువల్ల చందాలు త్వరలోనే ఘనంగా వసూలయ్యాయి.



శంకరశాస్త్రిగారి నిరంతర కృషి వల్ల ఆలయానికి మరమ్మత్తులు త్వరత్వరగా పూర్తి అయ్యాయి. ఆలయం కళకళలాడసాగింది. ఆలయంలో ఒకప్పటిలా నిత్య ధూపదీప నైవేద్యాలు, పురాణ కాలక్షేపాలు, భజనలూ వంటివి నిత్యకృత్యంగా జరగసాగాయి.

శాస్త్రిగారు కూడా ఆ ఆలయం ఆవరణలోనే ఒక కుటీరం వేసుకుని అక్కడే వుండసాగాడు.

చందాల రూపంలోవున్న సొమ్ము ఇంకా చాలానే వుంది. దానితో ఆలయం చుట్టూ వున్న ఖాళీ స్థలాన్ని సేకరించి అందులోనే వేదపాఠశాల, గురుకులం వంటి వాటిని ఏర్పరచాలన్న సంకల్పం ఆయనకి కలిగింది.

గుడికి, సముద్రం అంచుకి మధ్యన వున్న బంజరుభూమి అంతా ఆ ఊరి మోతుబరి అయిన సర్వారాయుడిది. తన సంకల్పాన్ని చెప్పి ఆ స్థలాన్ని సర్వారాయుడి దగ్గర కొనాలనుకున్నారు ఆలయ పెద్దలు. అది దైవకార్యం కావడంతో, అందులోనూ శంకరశాస్త్రిగారు పూనుకోవడంతో సంతోషంగా స్థలాన్ని అమ్మడానికి ఒప్పుకున్నాడు సర్వారాయుడు.

నిజానికి- అక్కడ స్థలం కొనేవారుకూడా ఎవరూ వుండరు. అనుకోకుండా మంచి గిరాకీ వచ్చింది సర్వారాయుడికి. స్థలం రిజిష్టరు అయింది.

దస్తావేజులు రాసేటప్పుడు అందులో స్థలం ఎల్లలు పేర్కొంటారు కదా! అందువల్ల మూడు వైపుల వున్న భూభాగాన్ని సవివరంగా పేర్కొని, నాలుగవ వైపున – అంటే... తూర్పున సముద్రాన్నే సరిహద్దుగా పేర్కొన్నారు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

ఆలయం 'మూడు పూవులు – ఆరు కాయలు' గా గొప్పగా, రంగ రంగ వైభవంగా వెలుగొందుతోంది.

క్రమేపీ ఆ ప్రాంతంలో భౌగోళికంగా ఎన్నో మార్పులు రాసాగాయి.

గుడి నుంచి సుమారు రెండు ఫర్లాంగుల దూరంలో వుండిన సముద్రం, మరో అరమైలు వెనక్కి పోయింది. అంటే- దేవాలయానికి అనుకోకుండా తూర్పువైపున మరో అరమైలు స్థలం కలిసి వచ్చిందన్నమాట.

దేవాలయానికి అంత స్థలం కలిసి వచ్చేసరికి సర్వారాయుడుకి కన్నుకుట్టింది. 'నోరు లేని దేవుడు అంత స్థలం ఏమి చేసుకుంటాడు?' అనుకున్నాడు.

'తాను అమ్మినప్పుడు ఎంత స్థలం ఇచ్చాడో అంతమాత్రమే గుడిది అనీ, మిగిలినది తనదేనని'– శంకర శాస్త్రిగారితో, గుడి యజమాన్యంతో పేచీకి దిగాడు.

తూర్పున సరిహద్దుగా సముద్రాన్ని పేర్కొనడం జరిగింది కనుక.., సముద్రం వరకు తమదేనని గుడివారి వాదన.

చివరికి ఈ వ్యవహారం అలా అలా రాజుకుని న్యాయస్థానం వరకు వెళ్లింది.

న్యాయమూర్తి శ్రీ రంగాచార్యులుగారు న్యాయశాస్త్రంలో మంచి దిట్ట. ఆయన వాది, ప్రతివాదుల వాదోపవాదాలను శ్రద్ధగా విన్నారు. చివరికి ఆయన సర్వారాయుడితో ఈ విధంగా అన్నారు–

"రాయుడుగారూ... మీరు అమ్మినప్పుడు సముద్రం ఎక్కడ వుందో, అక్కడి వరకే గుడికి చెందుతుందనీ, సముద్రం వెనక్కి పోవడం వల్ల వచ్చిన స్థలం మీదేనని అంటారు... అవునా?"

"చిత్తం ప్రభూ..!"

"రేపు సముద్రం గుడివైపుకు చొచ్చుకుని వచ్చి మీరు అమ్మిన స్థలంలో చాలాభాగాన్ని మింగేసిందనుకోండి. మరి, ఆ మేరకు గుడివారికి ముదరా ఇస్తారా?"

ఆ ప్రశ్న వేసేసరికి సర్వారాయుడికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఏమీ మాట్లాడలేక నీళ్ళు నమలసాగాడు.

"రాయుడుగారూ... మీరు సమాధానం చెప్పలేరని నాకు తెలుసు. మీ దస్తావేజులో సముద్రాన్ని ఎల్లగా పేర్కొన్నారు. అటువంటప్పుడు సముద్రం వెనక్కుపోయినా, ముందుకు వచ్చినా మీకు సంబంధం లేదు. మీరు అత్యాశతో దేవుడికే శఠగోపం పెట్టాలనుకొన్నారు. అనవసరంగా ఈ వ్యాజ్యాన్ని వేసినందుకు గుడివారికి అయిన ఖర్చులన్నీ మీరు భరించాలనీ, ఏ స్థానంలో వున్నా సముద్రమే గుడికి తూర్పు వైపు సరిహద్దుగా వుంటుందనే నేను తీర్పు ఇస్తున్నాను" అంటూ ముగించారు శ్రీ రంగాచార్యులవారు.

'దురాశ దుఃఖానికి చేటు' – అన్న సామెత గుర్తు చేసుకుంటూ లబోదిబోమంటూ ఇంటికి వెళ్లాడు సర్వారాయుడు.

★★★

